క్లుప్తంగా

గ్రంథాలయ వారోత్సవాలు

ఓబులవారిపల్లె : నవంబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని గ్రంథాలయ నిర్వాహకులు అష్రఫ్ అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించడం జరుగుతుందని వారు తెలిపారు.

రేపు ధ్యాన - జ్ఞాన ఉచిత శిక్షణ

రాజంపేట టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ప్రాంగణంలో ఉన్న సరస్వతీ పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రంలో పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ రాజంపేటశాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా ధ్యాన – జ్ఞాన శిక్షణను ఇవ్వనున్నట్లు ఆ క్షేత్రం అధ్యక్షుడు ఆంజనేయులునాయుడు, కార్యదర్శి రామచంద్రనాయుడు, ప్రధాన సలహాదారు టి.రెడ్డయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన సీనియర్ గ్రాండ్ పిరమిడ్ మాస్టర్ తటవర్తి వీరరాఘవరావు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని రాజంపేట పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సచివాలయాలు తనిఖీ



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జవహర్

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి, జ్యోతి గ్రామ సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో సంతకాలు పెట్టని వారికి నోటీసులు జారీ చేయాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశించామని చెప్పారు. బయోమెట్రిక్ విధానంలో అటెండెన్స్ వేశారని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఎక్కడి నుంచి వేశారు అనే విషయమై సమగ్ర విచారణ జరుపుతామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయం పాటిస్తూ అందరూ విధులకు హాజరు కావాలని ఆయన అన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం



ఆరోగ్య సురక్ష కిట్‌ను అందిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యమని ఉప సర్పంచ్ తోట శివసాయి, ఏపీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, పార్టీ పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్‌లు బుధవారం తెలిపారు. పట్టణంలోని సచివాలయం – 2లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అలాగే వైద్యం కోసం వచ్చిన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల ప్రజల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అంది ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి గడపకు వైద్యం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, అబ్దుల్ రౌఫ్, ఎంపీటీసీ ధన, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ



విద్యార్థులతో భవిత స్కూల్ ఐఈఆర్‌టీలు

సిద్దవటం : జిల్లాస్థాయిలో బుధవారం జరిగిన క్రీడా పోటీల్లో సిద్దవటంకు చెందిన భవిత స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ఐఈఆర్‌టీలు విజయలక్ష్మి, పద్మావతిలు తెలిపారు. సిద్దవటంలో బుధవారం వారు మాట్లాడుతూ కడపలోని మున్సిపల్ స్టేడియంలో జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త అంబవరపు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా విద్య సమన్వయకర్త కేశవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ భవిత పాఠశాలకు చెందిన ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులు జూనియర్ విభాగం పరుగు పందెంలో భవాని, సీనియర్ విభాగం పరుగు పందెంలో పల్లవి, షాట్ పుట్‌లో వెంకట సుబ్బమ్మలు గెలుపొందారన్నారు. వీరికి అంబవరపు ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారన్నారు.

మద్యం పట్టివేత

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని అక్కయ్యపల్లెలో దాడులు నిర్వహించి రామమోహన్ అనే వ్యక్తి నుంచి ఇతర రాష్ట్రాలకు సంబంధించిన 133 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు.

పేదల అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

– ఎమ్మెల్యే కొరముట్ల, స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డిలు



గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల, కొండూరు అజయ్‌రెడ్డిలు

పెనగలూరు : పేదల అభివృద్ధే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు అన్నారు. బుధవారం మండలంలోని ఈటమాపురం, తూర్పుపల్లి, దళితవాడ, అరుంధతివాడలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి ఆ కుటుంబం పొందిన లబ్ధిని వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తీర్చేందుకే ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అందుకే ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను సీఎం క్యాంపు ఆఫీసుకు పంపుతామన్నారు. ముఖ్యంగా పెన్షన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనివారిని గుర్తించి వారికి న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి ఆరా తీశారు. రాజుపాలెంలో వర్షం కురిస్తే రోడ్డుపై నీరు నిలుస్తున్నాయని, చదరంగా రోడ్డు వేయాలని వారు కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, కొండూరు అజయ్ రెడ్డిలు సంబంధిత అధికారులతో చర్చించి దీనిపై పూర్తి సమాచారం తమకు ఇవ్వాలన్నారు. అలాగే వృద్ధాప్య పెన్షన్, పక్కా గృహాలు రాలేదని, ఒకటి రెండు ఫిర్యాదులు అందాయని వాటిపై పూర్తి వివరణ ఇవ్వాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని, ఈ విషయంపై సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరినీ గుర్తించి దరఖాస్తు చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే దృక్పథంతో ఉన్నారన్నారు. మహిళలకు సంబంధించి ఎలాంటి పథకాలు అందకున్నా వారిపై విచారణ చేసి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. దివ్యాంగులు ఉంటే వారికి రెండో పెన్షన్ ఇచ్చేందుకు కూడా చర్యలు చేపట్టాలన్నారు. పలు అంశాలపై వారికి వివరించారు.

గర్భిణులకు సామూహిక శ్రీమంతం

ఈటమాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి శ్రీమంతం కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కొరముట్ల, కొండూరు అజయ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు పౌష్టికాహారంగా పండ్లు తెచ్చుకోవాలని ఒక్కొక్క గర్భవతికి రూ. 500లు చొప్పున కొండూరు అజయ్ రెడ్డి అందించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త గుండాల్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ సుదర్శన్, శంకర్ రెడ్డి, డీలర్ వెంకటరమణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈటమాపురం శంకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కొండూరు విజయ్ రెడ్డి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఈశ్వరయ్య, జెడ్పీటీసీ సుబ్బారాయుడు, శ్రీనివాసులు రెడ్డి, అమరనాథరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, యానాదయ్య, రాజుపాలెం రాజులు, కోడూరు మల్లి, పెంచలయ్య, చిన్నయ్య, పుచ్చకాయల శివశంకర్‌ల తోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



న్యాయవాదులతో సమావేశమైన జడ్జి లత

నందలూరు (రాజంపేట) : జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.లత పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టులో డిసెంబర్ నెల 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి అడ్వకేట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కరించాలని వారికి తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సిటింగ్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యానందం, ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు, న్యాయవాదులు ఏవీ సుబ్రమణ్యం, ఎస్.మహమ్మద్ అలీ, జి.సుబ్బరామయ్య, హెచ్.ఆనంద కుమార్, సమీవుల్లా ఖాన్, నూర్ మహమ్మద్‌లు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో చిన్నారుల జీవితాలు అంధకారం



వీరబల్లె: మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి



రైల్వేకోడూరు: బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరబల్లె (రాయచోటి టౌన్) : బాల్య వివాహాలను జరిపి చిన్నారుల జీవితాలను అంధకారం చేయొద్దని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో బాల్యవివాహాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు వయస్సుకు రాకముందే పెళ్లిలు చేసి వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. మగ పిల్లలతో సమానంగా పెంచి, మంచి చదువులు చెప్పించి వారు వారి జీవితంలో స్థిరపడే విధంగా తీర్చిదిద్ది ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వలన ఆడపిల్లల్లో మానసిక, శారీరక ఆరోగ్య ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 21 సంవత్సరాలు నిండితేనే వివాహం చేయాలని సూచించారు. ఎవరైనా బాల్య వివాహాలను నిర్వహిస్తే అలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించిన వారు తల్లిదండ్రులను సరే కఠినంగా శిక్షించాలని అధికారులకు సూచించారు.

బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన

రైల్వేకోడూరు : మండలంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి ఏపీడీపీఓ సరళాదేవి ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే అనేక అనర్థాలు, సమస్యలు ఉంటాయన్నారు. 18 సంత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాలలోపు బాలురకు వివాహం జరిపితే చట్టపరంగా పెద్దలకు రెండు సంవత్సరాలు జైలు, లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబరు – 1098, 181, 112, 100 నెంబర్లకు సమాచారం అందించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ జ్యోష్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ వర్మ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాయచోటి, రాజంపేట నియోజకవర్గ కన్వీనర్లు అరమాటి శివగంగిరెడ్డి, జగదీష్ స్వామి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ గిరీషా పీఏస్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో వర్షాలు సక్రమంగా కురువకపోవడంతో పంటలు పండలేదన్నారు. దీంతో రైతాంగం వేసిన పంటలు అక్కడిక్కడే ఎండిపోయాయని దీంతో రైతులు అంతా తీవ్రంగా నష్టపోయారన్నారు. జిల్లా కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, తాలుకా నాయకులు పాల్గొన్నారు.

అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో 30 మండలాలు ఉండగా 18 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి మిగిలిన మండలాల్లో కరువు లేదనడం దారుణమన్నారు. ప్రభుత్వం జిల్లాలో మిగిలిన 12 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. కరువు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం వెంటనే రైతులకు సబ్సిడీ కింద ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు రైతులకు సరఫరా చేయాలన్నారు. రైతు రుణాలను మాఫీ చేయడంతో పాటు తిరిగి కొత్త రుణాలను మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, గంగయ్య, రాము, కేశవ పాల్గొన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

రూ.18 లక్షలతో రామాపురంలో ఆర్టీసీ బస్‌షెల్టర్ భూమిపూజలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రామాపురంలో రూ.18 లక్షల ఎంపీ మిథున్‌రెడ్డి నిధులతో (ఎంపీ ల్యాడ్స్) ఆర్టీసీ బస్‌షెల్టర్ నిర్మాణ పనుల భూమిపూజలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా బస్‌షెల్టర్‌ను నిర్మిస్తున్నామన్నారు. బస్‌షెల్టర్‌లో మౌలిక వసతులతోపాటు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిర్మాణ పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. బస్‌షెల్టర్ నిర్మాణానికి సహకరించిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుచున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నపు విశ్వనాథరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సర్పంచులు నాగభూషణ్‌రెడ్డి, వలపలి వెంకటరెడ్డి, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, సత్యాయాదవ్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



రాజంపేట టౌన్: నినాదాలు చేస్తున్న విద్యార్థి నేతలు

రాజంపేట టౌన్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రక్రియను విరమించుకోవాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకై బుధవారం వివిధ విద్యార్థి సంఘం నాయకులు చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు చేపట్టిన బంద్ వల్ల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ అనేక మంది ప్రాణత్యాగాల ఫలితంగా విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైందని, ఆ పరిశ్రమ వల్ల వేలాది మందికి ఉపాధి లభిస్తోందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించాలన్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం సంపూర్ణంగా సహకరించాలని తెలిపారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయకూడదని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బంద్‌లో భాగంగా సామూహికంగా మూసివేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు అడ్డుకునే అధికారం ఎవరికీ లేదు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

వీరబల్లె (రాయచోటి టౌన్) : తాగునీటి బోరు నీటిని ప్రజలకు అందకుండా అడ్డుకునే అధికారం ఎవరికీ లేదని ఎంపీడీఓ మల్లీశ్వరి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె గ్రామం బెజవాడ హరిజనవాడలో తాగునీటి సమస్య తలెత్తడంతో ఆమె ఆ గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలంలో సమస్యను పరిశీలించారు. అక్కడ ప్రభుత్వ బోరు తమ పొలంలో ఉందని మీకు నీరు ఇవ్వడానికి వీలు కాదని చెప్పడంతో తాగునీటి సమస్య ఉత్పన్నమయింది. ఈ విషయం ఆమె దృష్టికి రావడంతో సంబంధిత వ్యక్తిని పిలిచి స్థలం ఎవరిదైనా ప్రభుత్వ బోరు నుంచి నీరు ప్రజలు ఉపయోగించుకొంటున్నారని అలాంటి సమయంలో బోరు నుంచి అభ్యంతరం చెప్పకూడదని సూచించారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అలా కాకుండా ఎవరైనా అడ్డుకుంటే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గెలుపు కోసం బాధ్యత తీసుకోవాలి

న్యాయవాదులతో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఎం.ప్రభాకర్

రాయచోటి టౌన్ : వచ్చే ఎన్నికలలో జగనన్నను గెలిపించుకుందామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఎం.ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం రాయచోటిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి వీసీ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించుకొనే బాధ్యత న్యాయవాదులు తీసుకోవాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా లా నేస్తం ద్వారా ఆదుకున్నారన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్‌కు రూ.25 కోట్లు నిధుల కేటాయించారని చెప్పారు. న్యాయవాదుల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. త్వరలో అన్నమయ్య జిల్లాలో న్యాయవాదుల జిల్లా లీగల్ సెల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం న్యాయవాదులు బి. నరసింహారెడ్డి, డి. రామ్‌నాయక్, ఎస్. తాహిర్‌బాషా, ఎ. వెంకటేశ్వర్లు, వాసుదేవుడు తదితరులుతో కలసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం గ్రామంలోని పెంచల కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పారిశ్రామికవేత్త బత్తిన గుండాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తిరుమల నుంచి తెచ్చిన ప్రసాదాన్ని పంచిపెట్టారు. కార్యక్రమంలో పెంచల నరసింహస్వామి అభివృద్ధి ట్రస్టు చైర్మన్ శంకర్ రెడ్డి, అమరనాథరెడ్డి, నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రం మార్కెటింగ్

రామాపురం : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కేంద్ర మార్కెటింగ్‌తో అనుసంధానం జరుగుతుందని రాష్ట్ర స్థాయి ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతు శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. గత ఆరు సంవత్సరాలుగా అన్నమయ్య జిల్లా స్థాయిలో ప్రకృతి వ్యవసాయం నలుమూలల రైతులతో వ్యవసాయం ముందుకు వెళ్తూ మంచి దిగుబడులు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఎం.శ్రీనాథరెడ్డి రాష్ట్ర స్థాయిలో ఐసీసీ ఆర్ పూస క్యాంపస్ ఢిల్లీలో కేంద్ర గృహ మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు కేంద్రం అనుసంధానం చేస్తోందన్నారు. రైతులు పండించిన పంటలకు సంబంధిత అధికారులు సర్టిఫై చేసి మార్కెట్‌లో ఉంచుతారన్నారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతోపాటు మంచి లాభాలు గడించే అవకాశాలు గణనీయంగా ఉన్నాయని తెలిపారు.

'ప్రజా రక్షణభేరి'ని విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక రాజకీయాలకు నిరసనగా ఈనెల 15న విజయవాడలో నిర్వహింప తలపెట్టిన ప్రజారక్షణ భేరి బహిరంగసభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన సీపీఎం నేతలతో కలసి ప్రజా రక్షణభేరి ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక రాజకీయాలను రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్షాల నేతలు బలపరుస్తున్నారన్నారు. పార్లమెంటులో బీజేపీకి మద్దతునిస్తూ రాష్ట్రంలో వివిధ రకాల పేర్లతో యాత్రలు చేస్తుండడం దారుణమన్నారు. ఒకవైపు సామాజిక న్యాయాన్ని సంహరిస్తూనే మరోవైపు తామే సామాజిక న్యాయాన్ని కాపాడుతున్నామన్నట్లు ఊరేగింపులు, సంబరాలు చేసుకుంటూ సాధికారతను అపహాస్యం చేస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించే ఒడుకే ప్రజారక్షణభేరి యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, నరసింహులు, మాధవయ్య, సిద్దేశ్వర, రమేష్ పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : ఈనెల 15న విజయవాడలో నిర్వహించే ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేసుకుందాని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణిలు కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజారక్షణ భేరి గోడపత్రాలను సీపీఎం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించే ఈ బహిరంగ సభకు జిల్లాలోని ప్రతి సీపీఎం కార్యకర్త అందులో పాల్గొనాలని కోరారు. గోడపత్రాలు విడుదల చేసిన వారిలో కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సీపీఎం నాయకులు ఓబయ్య, ప్రసాద్, మురళీ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నందలూరు క్రీడా మైదానానికి మరమ్మతులు



మైదానంలో కొలతలు తీస్తున్న అధికారులు

నందలూరు (రాజంపేట) : ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సూచనతో నందలూరు జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో మరమ్మతులకు బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రౌండ్ మరమ్మతుల సమస్య ఎంతో కాలంగా నిలిచిపోయి ఉండగా స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ స్కౌట్ గ్రూప్ వ్యవస్థాపకులు వేపగుంట సాంరాజ్ మైదానం స్థితిగతులు, నూతన స్టేజీ భవనం, డ్రెసింగ్ రూముల నిర్మాణం, ఇతర మరమ్మతుల కోసం విన్నవించగా స్పందించిన ఆకేపాటి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయగా కడప ఏఈ ప్రశాంత్, సిబ్బంది బుధవారం ఉదయం గ్రౌండ్‌కు వచ్చి కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో పి.మారుతి, జి.మల్లికార్జున రెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, క్రికెటర్ గ్రీష్మంత్ రెడ్డి, ఆనాల మధు, డాక్టర్ వి.డేవిడ్ కళ్యాణ్ రాజ్ పాల్గొన్నారు.

దారి సమస్యను పరిష్కరించండి

ఓబులవారిపల్లె : గొబ్బూరువారిపల్లె గ్రామంలో దళితుల గ్రామంలో దారి సమస్యను పరిష్కరించాలని జెడ్పీటీసీ లక్ష్మినరసయ్య తహసీల్దార్ పుల్లారెడ్డిని కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌తో జెడ్పీటీసీ లక్ష్మినరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సమావేశయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్ మాట్లాడుతూ సర్వే నెంబరు – 121లో దళితుల దారి ఆక్రమణకు గురైందని, దాదాపు 30 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఓజీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో స్థానికంగా ఉన్న సమస్యను పరిష్కరించాలని, రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణ అధికంగా ఉందని, వంక సర్వే నిర్వహించి ఆక్రమణ తొలగించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ హరి తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఉన్నా అనాథలా..



మృతి చెందిన వేమయ్య

గాలివీడు : మండల పరిధిలోని గరుగుపల్లె చామకూరవాండ్లపల్లె కాలనీకి చెందిన వేమయ్య(40) మృతి చెందాడు. వేమయ్య అంత్యక్రియలు నిర్వహించడానికి బంధువులు ముందుకు రాకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి వద్దనే దాతల సహకారంతో దహన సంస్కారాలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్లితే మంగళవారం గాలివీడు బస్టాండ్ వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో 108 సిబ్బంది రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.